సాక్షి ఖమ్మం

బుధవారం : 28 : జూన్ : 2023



పెద్దాస్పత్రిలో దొంగల భయం!

జిల్లా జనరల్ ఆస్పత్రిలో చికిత్స కోసం వచ్చే వారి సెల్‌ఫోన్లే కాదు.. ఆస్పత్రి పరికరాలు కూడా తరచూ దొంగల పాలవుతున్నాయి. 8లో



కేఎంసీ చుట్టూ తిరగాల్సిందే..

నల్లా కనెక్షన్ మంజూరు మొదలు ఏ పని కావాలన్నా కేఎంసీ చుట్టూ తిరగాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు. 8లో

గరిష్టం / కనిష్టం 35° / 25°

వాతావరణం

జిల్లాలో బుధవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశముంది.

అన్నదాతలకు అండగా 'సాక్షి'

జిల్లా వ్యవసాయాధికారితో నేడు 'ఫోన్ ఇన్'



ఎం.విజయనిర్మల

ఖమ్మం వ్యవసాయం: వానాకాలం పంటల సీజన్ మొదలైంది. ఈసారి వర్షాలు ఆలస్యం కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యాన పంటల సాగుకు ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విత్తనాల ఎంపిక, నాటడంలో మెళకువలు, నకిలీ విత్తనాలను గుర్తించడం ఎలా తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించాలని 'సాక్షి' సంకల్పించింది. ఈమేరకు బుధవారం 'ఫోన్ ఇన్' ఏర్పాటుచేయగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయనిర్మల పాల్గొని రైతుల సందేహాలకు సమాధానాలు ఇస్తారు. రైతులు తమ సందేహాల నివృత్తి కోసం నిర్ణీత సమయంలో ఫోన్ చేయొచ్చు.

తేదీ : 28 - 06 - 2023, బుధవారం
సమయం : ఉదయం 9 నుంచి 10 గంటల వరకు
ఫోన్ చేయాల్సి నంబర్
72888 94200

కదనరంగం...



ఉమ్మడి జిల్లాపై జాతీయ, రాష్ట్ర పార్టీల నజర్

- తొలి సభతో బీఆర్ఎస్ సందడి
- ఇప్పటికే పలు సభలు నిర్వహించిన సీపీఎం, సీపీఐ
- వచ్చే నెల 2న రాహుల్‌గాంధీ కాంగ్రెస్ సభ
- త్వరలో అమిత్‌షా పర్యటన ఉంటుందంటున్న బీజేపీ

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఎన్నికలు సమీపిస్తున్న వేళ జాతీయ, ప్రాంతీయ పార్టీల సభలకు వేదికగా ఖమ్మం నిలుస్తోంది. రాష్ట్ర విభజన తర్వాత రెండు పర్యాయాలు జరిగిన ఎన్నికల్లో అధికార బీఆర్ఎస్ రాష్ట్రమంతటా ప్రభావం చూపినా ఉమ్మడి ఖమ్మంలో మాత్రం ఒకే ఒక్క స్థానంతో సరిపెట్టుకుంది. ఇదే సమయాన కాంగ్రెస్ పార్టీకి ఇక్కడే మెజార్టీ స్థానాలు దక్కగా.. మహాకూటమిలో భాగంగా టీడీపీకి ఈ ప్రాంతం కొంత ఊరటనిచ్చింది. అయితే రాబోయే ఎన్నికల్లో తమ ప్రాభవం కోసం అన్ని పార్టీలు ఉమ్మడి జిల్లాపై దృష్టి సారించాయి. తాజా రాజకీయ పరిస్థితులతో ఉమ్మడి ఖమ్మం జిల్లా రాష్ట్ర రాజకీయ యవనికపై కీలకంగా మారింది. వచ్చే నెల 2వ తేదీన ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ హాజరుకానున్న సభకు ఖమ్మంలో ఏర్పాట్లు శరవేగంగా సాగుతున్నాయి. ఇక ఇటీవల రద్దయిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సభ సైతం వచ్చే నెలలో నిర్వహించాలన్న ఆలోచనలో ఉన్నట్లు బీజేపీ నాయకులు చెబుతున్నారు.

కాంగ్రెస్‌లో ఉత్సాహం

రాష్ట్రంలో కాంగ్రెస్‌కు అధికారం దక్కకపోయినా.. గత ఎన్నికల్లో మహాకూటమిలో భాగంగా కాంగ్రెస్ ఆరు, టీడీపీ రెండు స్థానాల్లో విజయం సాధించాయి. దీంతో వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి జిల్లా అంతా ప్రభావం చూపేలా కాంగ్రెస్ సిద్ధమవుతోంది. మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్‌లో చేరుతుండటంతో కేడర్ ఉత్సాహంగా ఉండగా.. సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్ యాత్ర ముగింపునకు చేరుకుంది. ఈ నేపథ్యాన రెండు కార్యక్రమాలు ఒకే వేదికగా వచ్చేనెల 2న ఖమ్మంలో భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. సభకు ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ హాజరవుతున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. గత అసెంబ్లీ ఎన్నికల సమయాన జిల్లాకు వచ్చిన రాహుల్ నాలుగేళ్ల అనంతరం వస్తుండడంతో భారీ జన సమీకరణకు కాంగ్రెస్ సన్నాహాలు చేస్తోంది. పొంగులేటి వ్యవసాయ క్షేత్రంలో నిర్వహించే ఈ సభకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇక కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జాతీయ నాయకత్వాలు సైతం ఖమ్మంపైనే దృష్టి కేంద్రీకరించి బలాన్ని నిలుపుకునే దిశగా అడుగులు వేస్తున్నట్లు తాజా సమీకరణలతో స్పష్టమవుతోంది.

బీఆర్ఎస్ ఫోకస్

గత రెండు ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఒక్కో స్థానానికే బీఆర్ఎస్ పరిమితం కాగా, ఈసారి అధిక స్థానాలు సాధించాలనే ఉద్దేశంతో బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో ఖమ్మంపై దృష్టి సారించి.. బీఆర్ఎస్ తొలి సభ ఇక్కడే నిర్వహించారు. ఢిల్లీ, పంజాబ్, కేరళ సీఎంలు కేజ్రీవాల్, భగవంత్‌సింగ్ మాన్, పినరయ్ విజయన్, ఉత్తర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్‌యాదవ్ కూడా ఈ సభకు హాజరయ్యారు. అలాగే పలువురు మంత్రులు జిల్లాలో పర్యటిస్తూ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేస్తున్నారు. వీటితోపాటు జిల్లా నుంచి ఎమ్మెల్సీగా తాత మధుసూదన్, రాజ్యసభ సభ్యులుగా వద్దిరాజు రవిచంద్ర, బండి పార్థసారధిరెడ్డికి అవకాశం కల్పించడం ద్వారా ఉమ్మడి ఖమ్మం జిల్లాకు కేసీఆర్ ప్రాధాన్యత ఇచ్చినట్లు అర్థమవుతోంది. కాంగ్రెస్ సభ ముగిశాక వచ్చే నెల రెండో వారంలో మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, మహమూద్ అలీ పలు నియోజకవర్గాల్లో పర్యటించేలా కార్యక్రమాలకు రూపకల్పన చేస్తున్నారు.

పట్టు కోసం బీజేపీ పాట్లు

ఉమ్మడి జిల్లాలో పట్టు సాధించేలా బీజేపీ నుంచి కేంద్ర మంత్రులు తరచుగా జిల్లాలో పర్యటిస్తున్నారు. తమకు ఇక్కడ బలం లేదనే ప్రతిపక్షాల ప్రచారాన్ని తిప్పికొట్టాలనే ఉద్దేశంతో ఈనెల 15న అమిత్‌షా సభ లక్ష మందితో నిర్వహించాలని నిర్ణయించారు. ఇంతలోనే బిపర్‌జాయ్ తుపాను కారణంగా ఈ సభ రద్దు కాగా, జిల్లా, రాష్ట్ర నాయకత్వానికి నిరాశ ఎదురైంది. అయితే వచ్చే నెలలో జిల్లా కేంద్రంలో అమిత్ షా సభ ఉంటుందని ఆపార్టీ నేతలు చెబుతున్నారు. ఇక మే 27న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఖమ్మంలో జరిగిన నిరుద్యోగ మార్చ్‌లో పాల్గొన్నారు.

ప్రాభవం కోసం కమ్యూనిస్టులు

జాతీయ పార్టీలుగా ఉన్న సీపీఎం, సీపీఐ ఈసారి అసెంబ్లీలో ప్రాతినిధ్యం కోసం ఆరాటపడుతున్నాయి. దీనికోసం రాష్ట్రంలో పట్టున్న ఉమ్మడి ఖమ్మం జిల్లాపైనే దృష్టి సారించినట్లు తెలుస్తోంది. సీపీఎం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శులు.. తమ్మినేని వీరభద్రం, కూనంనేని సాంబశివరావు ఉమ్మడి జిల్లా వాసులే కావడంతో ఇక్కడి నుంచే పూర్వవైభవం కోసం ప్రయత్నాలు మొదలుపెట్టారు. ప్రజాసమస్యలపై పోరాడుతూనే తరచుగా సభలు నిర్వహిస్తున్నారు. ఖమ్మంలో సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యవసాయ కార్మిక సంఘం మహాసభల్లో కేరళ ముఖ్యమంత్రి పినరయ్ విజయన్ పాల్గొన్నారు. ఇక ఇటీవలే కొత్తగూడెంలో జాతీయ, రాష్ట్ర నాయకత్వంతో సీపీఐ ప్రజాగర్జన సభ నిర్వహించి వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి తాము సిద్ధమనే సంకేతాలు ఇచ్చారు.

వరుణదేవా కరుణించవా?!



వైరా రిజర్వాయర్‌లో 14.8 అడుగులకు పడిపోయిన నీటిమట్టం

- వైరా రిజర్వాయర్ ఆయకట్టు రైతుల ఆందోళన
- సాగునీటి కోసం ఎదురుచూపులు
- అదను దాటిపోతోందని ఆవేదన

వైరా: జిల్లాలో అన్నపూర్ణగా పేరు గాంచిన వైరా రిజర్వాయర్ ఆయకట్టు పరిధిలో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. జూన్‌లో సగం ముగిసినా రిజర్వాయర్‌లోకి చుక్క నీరు చేరకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు రిజర్వాయర్‌లో నీరు అడుగంటుతుండగా వానాకాలం పంటలు ఎలా సాగు చేయాలో అర్థం కాక వరుణుడి కరుణ కోసం ఎదురుచూస్తున్నారు. నాగార్జునసాగర్ నుంచి జలాలు వచ్చే పరిస్థితి లేకపోవడంతో వరుణుడు కూడా ముఖం చాటేస్తే ఆయకట్టు పరిధిలో సుమారు 20 వేల ఎకరాలు బీడుగా మారే పరిస్థితి నెలకొంది.

రిజర్వాయర్ సామర్థ్యం ఇలా..

వైరా రిజర్వాయర్ సుమారు వందేళ్ల నాటి మధ్యతరహా నీటి ప్రాజెక్టు కాగా.. 25 వేల ఎకరాలకు సాగు నీరు అందిస్తుంది. రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటి మట్టం 18.4 అడుగులు అయితే ప్రస్తుతం 14.8 అడుగులు మాత్రమే నీరు ఉంది. ఆయకట్టులో ఏటా వర్షాకాలం సీజన్‌లో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగానే మారుతోంది. ఈసారి కూడా రిజర్వాయర్‌లో ఆశించిన మేరకు నీరు చేరకపోవడంతో వరి నాట్లు వేయాల్సిన రైతులు ఎదురుచూడాల్సి వస్తోంది.

కుడి, ఎడమ కాల్వలకు మరమ్మతులు

రిజర్వాయర్ ఆయకట్టు పరిధిలో కుడి, ఎడమ కాల్వలకు జల వనరుల శాఖ ఆధ్వర్యంలో మరమ్మతులు జరుగుతున్నాయి. లెఫ్ట్ కెనాల్ పరిధిలో 7, 8 నంబర్ల తూములు నిర్మాణం చేపట్టాల్సి ఉంది. రైట్ కెనాల్ పరిధిలో 6ఏ, 6సీ, 7, 28 నంబర్ల తూముల పనులు చేస్తున్నారు. సిమెంట్ పనులు, జంగిల్ క్లియరెన్స్ ఇంకా జరగాల్సి ఉంది.

విత్తనాల పంపిణీ పూర్తి

వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు ఆయకట్టు రైతులకు జీలుగులు 1850 క్వింటాళ్లు, జనుము 85 క్వింటాళ్ల విత్తనాలు పంపిణీ చేశారు. మరోపక్క రైతులు వరి, పత్తి విత్తనాలను సిద్ధం చేసుకున్నారు. పొడి దుక్కులో పత్తి విత్తనాలు నాటిన రైతులు వరి నాట్లు వేసేందుకు అదును కోసం చూస్తున్నారు. జూలై మొదటి వారంలోగా వర్షాలు ఆశించిన స్థాయిలో రాకపోతే వరిలో బీపీటీ రకం కూడా సాగు చేసేందుకు అవకాశముండదని చెబుతున్నారు. వైరా మండలంలో బోర్ల కింద వరి సాగు చేసే రైతులు సుమారు 2 వేల ఎకరాల్లో ఇప్పటికే నార్లు పోసుకోగా, రిజర్వాయర్‌పై ఆధారపడిన రైతులు మాత్రం వర్షాల కోసం చూస్తున్నారు.

ఎందుకీ పరిస్థితి?

రిజర్వాయర్ పరిధిలో అన్ని పంటలు కలిపి 25 వేల ఎకరాల్లో సాగవుతుండగా, సింహభాగం 20 వేల ఎకరాల మేర వరి ఉంటుంది. ఏటా జూన్, జూలై నెలల్లో వర్షాలు కురిస్తే ఆశించిన స్థాయిలో పంటలు సాగవుతాయి. లేదంటే అన్నదాత పరిస్థితి ప్రశ్నార్థకమే. కొణిజర్ల, ఏన్కూరు, కారేపల్లి, ఇల్లెందు ప్రాంతాల్లో కురిసిన వర్షపు నీరు వచ్చి చేరితే రిజర్వాయర్ నిండుతుంది. లేదంటే సాగర్ జలాలతో నింపాల్సి వస్తుంది. ఈసారి సాగర్ జలాలు కూడా చేరే పరిస్థితి కానరావడం లేదు. మరోపక్క రిజర్వాయర్ నుండి 12 మండలాలకు మిషన్ భగీరథ పథకం ద్వారా తాగునీరు విడుదల చేయాల్సి వస్తోంది. కానీ నీటి లభ్యత లేకపోవడంతో అటు తాగునీరు, ఇటు సాగునీటికి ఇక్కట్లు నెలకొన్నాయి. రిజర్వాయర్‌లో ప్రస్తుతం 1.8 టీఎంసీల నీరు ఉండగా 40 క్యూసెక్కులు తాగునీటికి వినియోగిస్తున్నారు. ఇక ఆయకట్టు పరిధిలో వర్షపాతం లోటు ఉందని, ఇప్పటివరకు 100 మి.మీ. వర్షపాతం కూడా నమోదు కాలేదని అధికారులు తెలిపారు.

16 అడుగులు ఉంటేనే..

వైరా రిజర్వాయర్‌లో 14.8 అడుగుల మేర నీరు ఉంది. రిజర్వాయర్‌లో 16 అడుగుల నీరు ఉంటేనే నారు మడులకు విడుదల చేస్తాం. కనీసం అర టీఎంసీ నారు మడులకే సరిపోతుంది. మరోపక్క సాగర్ జలాలు వచ్చే పరిస్థితి కూడా లేదు.

– పి.శ్రీనివాస్, ఐబీ డీఈ, వైరా

ఏటా ఇదే పరిస్థితి..



రిజర్వాయర్ ఆయకట్టు పరిధిలో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఏటా వానాకాలం పంటలు సాగు చేసుకునే సమయానికి ఆశించిన స్థాయిలో వర్షాలు కురవడం లేదు. దీంతో అదును దాటుతుందనే ఆందోళన చూడాల్సి వస్తోంది.

– షేక్ జానీ, రైతు, గొల్లపూడి

నారుమడులకు నీరు ఇస్తే బాగు..



ప్రస్తుతం వాతావరణ పరిస్థితుల్లో నారు మడులకు నీరు ఇస్తే రైతులకు మేలు జరుగుతుంది. వర్షాల పరిస్థితి ఇలాగే ఉంటే ఆయకట్టు పరిధిలో రైతులు పరిస్థితి ప్రశ్నార్థకంగా మారుతుంది. అధికారులు సాగు అవసరాలకు నీరు విడుదల చేయాలి.

– కోసూరి వెంకటరమణ, రైతు, పాలడుగు

న్యూస్‌రీల్

సోక్ పిట్‌ల నిర్మాణంలో వేగం పెరగాలి



పాఠశాలలో సోక్ పిట్‌ను పరిశీలిస్తున్న డీఆర్డీఓ విద్యాచందన

కొణిజర్ల: ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్మిస్తున్న కమ్యూనిటీ సోక్ పిట్లను త్వరగా పూర్తిచేయాలని డీఆర్డీఓ విద్యాచందన సూచించారు. కొణిజర్లలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులను మంగళవారం ఆమె తనిఖీ చేశారు. నర్సరీని సందర్శించి హరితహారం కోసం మొక్కలుసిద్ధం చేయాలని సూచించిన డీఆర్డీఓ, ప్రభుత్వ కార్యాలయాల్లో సోక్ పిట్ల నిర్మాణంపై ఆరా తీశారు. అలాగే, జెడ్పీహెచ్ఎస్‌లో మధ్యాహ్న భోజనం, డిజిటల్ తరగతుల బోధన, కొణిజర్ల జాతీయ రహదారి పక్కన ఈజీఎస్ నిధులతో నిర్మించిన పబ్లిక్ టాయ్‌లెట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఆర్.రమాదేవి, కొణిజర్ల సర్పంచ్ సూరంపల్లి రామారావు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

2న జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ టోర్నీ

ఖమ్మంస్పోర్ట్స్: ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో 2వ తేదీన జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ టోర్నీ నిర్వహిస్తున్నట్లు బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తమ్మినేని వెంకట్రావు, ఎస్.ఉప్పల్‌రెడ్డి తెలిపారు. అండర్ 13, 15, 17, 19 విభాగాల్లో బాలబాలికలకు పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈనెల 30వ తేదీలోగా పేర్లు నమోదు చేసుకోవాలని, వివరాలకు 93969 72349, 94418 64167 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఎస్‌హెచ్‌జీలకు రూ.కోటి రుణాలు



చెక్కు అందజేస్తున్న బ్యాంకు మేనేజర్ నవీన్‌నాయక్

ఖమ్మంవ్యవసాయం: స్వయం సహాయక సంఘాలకు నారీశక్తి పథకం బ్యాంకు నుంచి రూ.కోటి రుణం మంజూరైంది. ఈ సందర్భంగా మంగళవారం ఖమ్మం–1 బ్రాంచిలో సంఘాల సభ్యులకు మంగళవారం బ్యాంకు సీనియర్ మేనేజర్ డి.నవీన్‌నాయక్ చెక్కు అందజేసి మాట్లాడారు. మహిళలు స్వయం ఉపాధి రంగాల్లో అభివృద్ధి సాధించేలా యూనియన్ బ్యాంక్ నారీశక్తి పథకం కింద రుణాలు ఇస్తోందని తెలిపారు. బ్యాంకు ఉద్యోగులు రాజేష్, రవి, రజియాబేగం, మధులత, వాసవి పాల్గొన్నారు.

రేపు రేవంత్‌రెడ్డి రాక..

- రాహుల్‌గాంధీ సభ ఏర్పాట్ల పరిశీలన
- కాంగ్రెస్ ముఖ్య నేతలతో సమావేశం



కాంగ్రెస్ బహిరంగ సభ కోసం సిద్ధమవుతున్న వేదిక

సాక్షిప్రతినిధి, ఖమ్మం: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి గురువారం ఖమ్మంకు రానున్నారు. మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్‌లో చేరిక, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క పీపుల్స్ మార్చ్ ముగింపు సందర్భంగా వచ్చేనెల 2న ఇక్కడ సభ నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈసందర్భంగా ఎస్ఆర్ గార్డెన్ సమీపాన పొంగులేటి వ్యవసాయ క్షేత్రంలో సభాస్థలి ఏర్పాట్లను రేవంత్ పరిశీలిస్తారు. ఈమేరకు సూచనలు చేయనున్న ఆయన, మాజీ ఎంపీ పొంగులేటితోపాటు కాంగ్రెస్ ముఖ్య నేతలతో సమావేశమై సభ నిర్వహణ, జన సమీకరణపై చర్చిస్తారు.

సభ సక్సెస్‌పై దృష్టి

వచ్చేనెల 2న నిర్వహించే సభ సక్సెస్ కోసం కాంగ్రెస్ పార్టీ సర్వశక్తులు ఒడ్డుతోంది. పార్టీలో తాను చేరుతున్న సందర్భంగా సభను విజయవంతం చేయడంపై పొంగులేటి ప్రత్యేక దృష్టి సారించారు. జన సమీకరణ కోసం నియోజకవర్గాల వారీగా కమిటీలను నియమించగా, దాదాపు 100 ఎకరాల్లో సభ నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ గత అసెంబ్లీ ఎన్నికల సమయాన ప్రచార నిమిత్తం ఖమ్మం వచ్చారు. ఆ తర్వాత మళ్లీ ఇప్పుడే వస్తుండడంతో సభ విజయవంతానికి కాంగ్రెస్ నేతలు సన్నాహాలు చేస్తున్నారు. ఈమేరకు ఖమ్మంకు 60 నుంచి 80 కిలోమీటర్ల పరిధి నుంచి జన సమీకరణకు నిర్ణయించారు. ప్రధానంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాతోపాటు మహబూబాబాద్, డోర్నకల్, సూర్యాపేట, కోదాడ, ములుగు తదితర ప్రాంతాల నుంచి పార్టీ శ్రేణులు, ప్రజలు హాజరయ్యేలా కృషి చేస్తున్నారు.

పెద్దాస్పత్రిలో మహిళల రద్దీ..

ఖమ్మంవైద్యవిభాగం: రాష్ట్రప్రభుత్వం ఈ ఏడాది ఏప్రిల్‌లో ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని ప్రారంభించింది. తొలి విడతగా జిల్లాలోని ఎం.వెంకటాయపాలెం, మంచుకొండ, కామేపల్లి, వైరా, చెన్నూరు, బోనకల్ పీహెచ్‌సీల్లో అమలు చేస్తుండగా, మహిళలకు ఓరల్, సర్వైకల్, బ్రెస్ట్ కేన్సర్, థైరాయిడ్, పోషకాహారలోపం, రక్తహీనత, మూత్రకోశ, సెలసరి తదితర సమస్యలకు చికిత్స అందిస్తున్నారు. అయితే, పీహెచ్‌సీల నుంచి ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రం (ఎంసీహెచ్)కు పలువురిని రిఫర్ చేస్తుండగా వారికి ప్రతీ మంగళవారం పరీక్షలు నిర్వహిస్తారు. అందులో భాగంగా ఎంసీహెచ్‌కు భారీగా మహిళలు, గర్భిణులు రావడంతో కిటకిటలాడింది.



ఎంసీహెచ్‌లో పరీక్షలకు వేచిఉన్న మహిళలు, గర్భిణులు

ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

- అక్రమ రవాణా కట్టడికి ఆరు చెక్ పోస్టులు
- నేర సమీక్షలో సీపీ విష్ణు ఎస్.వారియర్



మాట్లాడుతున్న సీపీ విష్ణు ఎస్.వారియర్

ఖమ్మంక్రైం: ఎన్నికలు సమీపిస్తున్న వేళ శాంతిభద్రతలను పరిరక్షిస్తూనే ఎన్నికలు సజావుగా పూర్తిచేసేందుకు పోలీసు యంత్రాంగం సిద్ధంగా ఉండాలని పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్.వారియర్ సూచించారు. ఖమ్మంలో మంగళవారం నిర్వహించిన నేర సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ అక్రమ రవాణాను అడ్డుకునేందుకు జిల్లా సరిహద్దులో ఆరు చెక్‌పోస్టులు ఏర్పాటుచేయగా, ఏసీపీలు తరచుగా తనిఖీ చేయాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలు, నేరస్తుల కదలికపై నిఘా వేసి శాంతి భద్రతలకు విఘాతం వాటిల్లకుండా తనిఖీలు చేపట్టాలని తెలిపారు. జాతీయ, రాష్ట్ర, గ్రామీణ రహదారులపై రోడ్డు ప్రమాదాల సంఖ్య తగ్గించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బ్లాక్ స్పాట్ల వద్ద రోడ్డు భద్రతా మార్గదర్శకాలకు అనుగుణంగా అన్ని చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇంకా పెట్రోల్ బంక్‌లు, దాబాల్లో కార్మికులకు సీపీఆర్‌పై అవగాహన కల్పించాలని సూచించారు. కాగా, ఎన్నికలకు సంబంధించి సున్నితమైన, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తింపుపై ఇప్పటి నుంచే దృష్టి సారించాలని సీపీ ఆదేశించారు. ఈ సందర్భంగా ఫంక్షనల్ వర్టికల్స్ అమలులో ప్రతిభ చూపిన పోలీస్ సిబ్బందికి సీపీ రివార్డులు అందజేశారు. ఈ సమావేశంలో ట్రైనీ ఐపీఎస్ అవినాష్‌కుమార్, అడిషనల్ డీసీపీలు సుభాష్‌చంద్రబోస్, కుమారస్వామి, ఏసీపీలు ప్రసన్నకుమార్, గణేష్, బస్వారెడ్డి, రెహమాన్, రామానుజం, వెంకటస్వామి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

6,589 మందికి పోడు పట్టాలు

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లాలో 6,589 మందికి పోడు పట్టాలు పంపిణీ చేయనున్నారు. అటవీ భూములు సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాలు ఇచ్చేందుకు ప్రభుత్వం గతంలోనే దరఖాస్తులు స్వీకరించింది. ఈమేరకు అధికారులు కమిటీల ద్వారా క్షేత్ర స్థాయిలో తనిఖీ చేశారు. అనంతరం జిల్లాలో 9మండలాల పరిధి 77 గ్రామపంచాయతీలు 106 గ్రామాల్లో 6,589 దరఖాస్తులను జిల్లా కమిటీ ఆమోదించింది. వీరికి త్వరలోనే పోడు హక్కు పత్రాలు అందజేయనున్నారు.

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలంలో శ్రీ సీతారామచంద్రస్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించిన అర్చకులు... నిత్యకల్యాణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించగా పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

క్లుప్తంగా

నేడు ఖమ్మంలో మంత్రి పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ బుధవారం ఖమ్మంలో పర్యటించనున్నారు. ఉదయం 10 గంటలకు జిల్లాకు చేరుకోనున్న ఆయన ఖమ్మం ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో పాకో మిషన్‌ను ప్రారంభిస్తారు. ఆతర్వాత జిల్లా కేంద్రంలో ఏర్పాటుచేసిన పలు కార్యక్రమాలకు మంత్రి హాజరుకానున్నారు.

పనులు వేగంగా పూర్తిచేయండి


అధికారులతో చర్చిస్తున్న చైర్మన్ కమల్‌రాజ్

ఖమ్మం సహకారనగర్: జిల్లాలోని మధిరతో పాటు ఇతర నియోజకవర్గాల్లో జిల్లా పరిషత్ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్‌రాజు సూచించారు. ఖమ్మంలోని జెడ్పీ కార్యాలయంలో మంగళవారం ఆయన పంచాయతీరాజ్ అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్షించారు. జిల్లా పరిషత్ నుంచి విడుదలైన నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను వర్షాలు జోరందుకోకముందే పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈఓ అప్పారావు, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల పంపిణీ జాబితాపై విచారణ


లబ్ధిదారులతో మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ రాధికాగుప్తా

నేలకొండపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో నివాస స్థలం పంపిణీకి జాబితా రూపొందించగా కొందరు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో అసిస్టెంట్ కలెక్టర్ రాధికాగుప్తా మండలంలోని మోటాపురం, సదాశివాపురంలో మంగళవారం పర్యటించి విచారణ చేపట్టారు. జాబితాలో పేర్లు ఉన్న వారి వివరాలు ఆరా తీయడమే కాక పేర్లు తొలగించినట్లు చెబుతున్న వారి ఇళ్లకు కూడా వెళ్లి మాట్లాడారు. తహసీల్దార్ దారా ప్రసాద్, ఆర్ఐ మాధవి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు వ్యవసాయ పరికరాలు


వరిగడ్డి చుట్టే యంత్రం అందజేస్తున్న నిర్వాహకులు

సత్తుపల్లిరూరల్: ఐటీసీ–ఎంఎస్‌కే సహకారంతో ఆదర్శ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యాన సత్తుపల్లి మండలంలోని పది గ్రామాల్లో ఏబీసీ(అగ్రి బిజినెస్ సెంటర్స్) కమిటీలు ఏర్పాటు చేశారు. ఆయా కమిటీలకు మంగళవారం వ్యవసాయ పరికరాలు అందించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ధనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ వ్యవసాయ ఖర్చులు పెరుగుతున్న నేపథ్యాన రైతుల కోసం పరికరాలు సమకూరుస్తున్నట్లు తెలిపారు. సంస్థ ఆర్గనైజర్ వై.ప్రభాకర్‌రావుతో పాటు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి


షేక్ గాలిబ్ (ఫైల్)

మధిర: మండలంలోని దెందుకూరుకు చెందిన యువకుడు మంగళవారం ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా ఉయ్యూరు మండలం ఓగిరాల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. గ్రామానికి చెందిన షేక్ గాలిబ్(24) చదువు పూర్తి చేసుకొని ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నాడు. ఆయన సొంత పనిపై ఉయ్యూరు వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో ఓగిరాల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మృతి చెందాడు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
మొక్కజొన్న	1,550	1,550
పెసలు	7,403	7,250
మిర్చి	19,600	13,500
ఏసీ మిర్చి	24,500	18,500
మిర్చి తాలు	13,000	8,000
పత్తి	6,650	4,000

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,346

పెద్దాస్పత్రిలో దొంగల భయం!

- రక్షణ కొరవడడంతో వరుస ఘటనలు
- సెక్యూరిటీని గాలికి వదిలేసిన ఏజెన్సీ నిర్వాహకులు
- సొంత పనులకు వాడుకుంటున్న ఉద్యోగులు, సిబ్బంది?


మ్యాన్ హోల్డ్స్ చోరీ చేయడంతో ఖాళీగా ఉన్న సిలిండర్లు

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం జిల్లా జనరల్ ఆస్పత్రిలో రక్షణ కరువైంది. ఆస్పత్రికి సంబంధించిన విలువైన వస్తువులు తరచూ మాయమవుతున్నాయి. అంతే కాకుండా రోగులు, వారికి సహాయంగా వచ్చే వారి సెల్ ఫోన్ల చోరీ పరిపాటిగా మారింది. ఇంత జరుగుతున్నా అధికారులు, సెక్యూరిటీ ఏజెన్సీ నిర్వాహకులు పట్టించుకోకపోవడంతో ఆస్పత్రికి వచ్చే వారు మండిపడుతున్నారు.

పెరిగిన తాకిడి

జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి ఇటీవల మెడికల్ కళాశాలగా మార్పు చెందింది. దీంతో నిత్యం వెయ్యి నుండి 1,500 మంది వరకు వైద్యసేవలకు వస్తుంటారు. అలాగే రోగుల సహాయకులతో నిత్యం ఆస్పత్రి కిటకిటలాడుతెఓంది. ఇదే అదనుగా కొందరు చోరీలకు పాల్పడుతున్నారు. రోగుల బెడ్ల వద్ద ఉండే ఫోన్లు, చార్జింగ్ పెట్టిన ఫోన్లు చోరీ చేస్తుండగా.. ఇటీవల ఆర్ఎంఓకు వరుస ఫిర్యాదులు అందుతున్నా ఎలాంటి చర్యలు లేదు. మరోపక్క ఆస్పత్రిలోని వస్తువులు కూడా తస్కరణకు గురవుతున్నాయి. తాజాగా ఆక్సిజన్ సిలిండర్లకు వినియోగించే మ్యాన్ హోల్డ్‌లు చోరీకి గురయ్యాయి. ఆక్సిజన్ సిలిండర్ల నుండి పైప్‌లైన్‌కు లింక్ కలిపేందుకు మ్యాన్ హోల్డ్స్ వినియోగిస్తారు. వీటిని చాలా వరకు దొంగలు ఎత్తుకెళ్లారు. అర్ధరాత్రి పూట ముసుగు వేసుకొచ్చి వీటిని చోరీ చేస్తున్నట్లు సీసీ కెమెరాల్లో రికార్డు అయినా పట్టించుకోవడం లేదు.

సెక్యూరిటీ ఉన్నట్టా.. లేనట్లా?

పెద్దాస్పత్రిలో సెక్యూరిటీ, పేషంట్ కేర్, స్వీపర్ల నిర్వహణ బాధ్యతను ప్రభుత్వ ఓ ఏజెన్సీకి కట్టబెట్టింది. ఆస్పత్రిలో 575 బెడ్లు ప్రాతిపదికగా బెడ్‌కు రూ.7,500 సదరు కాంట్రాక్టర్‌కు చెల్లిస్తోంది. ఈమేరకు 259 మంది సెక్యూరిటీ, పేషంట్ కేర్, స్వీపర్లను నియమించారు. ఇంత వరకు బాగానే ఉన్నా వారిని ఆస్పత్రి రక్షణకు వినియోగించట్లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆస్పత్రిలో అవసరం మేరకు సిబ్బంది లేకపోవడంతో వీరిని ఇతర పనులకు కేటాయిస్తున్నారని.. మరికొందరిని అధికారులు, ఉద్యోగులు వారి ఇళ్లలో పని చేయించుకుంటున్నారని సమాచారం. ఫలితంగా సెక్యూరిటీ గార్డుల కొరతతో చోరీలు సర్వసాధారణమయ్యాయి. ఇంత జరుగుతున్నా విషయం బయటకు పొక్కకుండా, పోలీసులకు ఫిర్యాదు చేయకుండా అధికారులు మిన్నకుంటున్నట్లు సమాచారం.

గట్టి నిఘా ఏర్పాటు చేస్తాం



ఆస్పత్రిలో చోరీలు జరగకుండా గట్టి నిఘా ఏర్పాటుచేస్తాం. సెల్‌ఫోన్లు చోరీకి గురైన విషయమై ఫిర్యాదులు అందాయి. అలాగే సిలిండర్లకు బిగించే మ్యాన్ హోల్డ్స్ కూడా దొంగిలించారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసి పకడ్బందీ రక్షణ చర్యలు తీసుకుంటాం.

– బి.శ్రీనివాసరావు, ఆర్ఎంఓ

కేఎంసీ చుట్టూ తిరగాల్సిందే..

- నల్లా కనెక్షన్ల జారీలో అంతులేని జాప్యం
- మిగతా సమస్యల పరిష్కారంలోనూ అదే పరిస్థితి
- అధికారుల నడుమ సమన్వయ లోపంతో ఇక్కట్లు
- మేయర్‌తో భేటీలో వెల్లడించిన కార్పొరేటర్లు


కార్పొరేటర్ల సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ నీరజ

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగర పాలకసంస్థ లో ఏ పని కావాలన్నా నెలల తరబడి కార్యాలయం చుట్టు ప్రదక్షిణ చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. పౌర సేవలందించడంలో కీలకమైన ఇంజనీరింగ్, పబ్లిక్ హెల్త్ విభాగాల సమస్యల పరిష్కారంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. కొత్తగా నల్లా కనెక్షన్లు, పైపులైన్లు కావాలంటే కాళ్లరిగేలా తిరిగినా పని కాకపోగా.. డివిజన్లలో చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తి చేయించడంలో అదే పరిస్థితి ఎదురవుతోంది. సాధారణ ప్రజల విషయం పక్కన పెడితే ప్రజాప్రతినిధులు చెప్పినా పనులు కాకపోవడంతో కార్పొరేటర్లు ఏం చేయాలో పాలుపోని పరిస్థితి ఎదుర్కొంటున్నారు.

సమన్వయ లోపం..

క్షేత్రస్థాయిలో ప్రజలకు అందించడంలో శానిటేషన్ విభాగంతో పాటు ఇంజనీరింగ్, పబ్లిక్ హెల్త్ విభాగాల కీలకమైనవి. ఇక ఇంజనీరింగ్, పబ్లిక్ హెల్త్ విభాగాలు పూర్తి సమన్వయంతో పనిచేస్తేనే ప్రజలకు తాగునీరు, రోడ్లు, డ్రెయిన్లు అందుబాటులోకి వస్తాయి. కానీ కేఎంసీలో ఈ రెండు శాఖల నడుమ సమన్వయ లోపంతో పనులు నెలల తరబడి పెండింగ్‌లో ఉంటున్నాయి. నల్లా కనెక్షన్ కోసం ఇంజనీరింగ్ శాఖకు దరఖాస్తు చేసుకుంటే ఆ శాఖ అధికారులు పబ్లిక్ హెల్త్ విభాగంతో సమన్వయం చేసుకొని మంజూరు చేసి నల్లా ఏర్పాటు చేయాలి. కానీ అధికారులు తమ బాధ్యత కాదన్నట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అధికారుల నిర్లక్ష్యం కారణంగా నగరంలో పైపులైన్లల లీకేజీలు, కనెక్షన్ల కోసం తవ్విన గుంతలు పూడ్చడంలో జాప్యం జరుగుతోంది.

పెండింగ్ పనులు పూర్తి చేయించండి..

డివిజన్ల వారీగా పెండింగ్‌లో ఉన్న పనులు త్వరగా పూర్తి చేయించాలని మేయర్ పునుకొల్లు నీరజ అధికారులను ఆదేశించారు. కార్పొరేటర్లు చెప్పిన సమస్యలు విన్న ఆమె సమస్యల పరిష్కారంపై సూచనలు చేశారు. నిధులు మంజూరైనందున పనులు పూర్తి చేయగానే కాంట్రాక్టర్‌కు బిల్లులు అందుతాయని తెలిపారు. ఈసమావేశంలో ఈఈ కృష్ణాలాల్, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

డివిజన్లలో తిరగలేకపోతున్నాం...

కొన్ని రోజులుగా ఇంజనీరింగ్, పబ్లిక్ హెల్త్ విభాగాల అధికారుల తీరుపై కార్పొరేటర్లు ఆగ్రహంగా ఉంటున్నారు. అధికారుల తీరుతో తాము ప్రజల వద్ద మాట పడాల్సి వస్తోందని, డివిజన్లలో తిరగలేకపోతున్నామని చెబుతున్నారు. ఫోన్ చేసినా అధికారులు స్పందించడం లేదని పలువురు కార్పొరేటర్లు మంగళవారం మేయర్ పునుకొల్లు నీరజ ఎదుట వాపోయారు. కార్పొరేటర్లతో సమావేశమైన మేయర్‌కు సమస్యలపై వినతులు అందజేశారు. ప్రధానంగా ఇంజనీరింగ్, పబ్లిక్ హెల్త్ విభాగాల సమస్యలే అధికంగా ఉన్నాయని తెలిపారు. కొత్త పైపులైన్ల ఏర్పాటు, నల్లా కనెక్షన్ల మంజూరు, లీకేజీలు, కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పాటులో జాప్యం జరుగుతుండడంతో ప్రజలకు ఏం సమాధానం చెప్పాలో తెలియడం లేదన్నారు. సీఎం హామీ కింద విడుదలైన రూ.90 లక్షల నిధులకు సంబంధించి పనులు, సుడా నిధులతో చేపట్టిన పనులకు టెండర్లు ఖరారు చేయడంలోనూ ఇదే నిర్లక్ష్యం ఉందని వాపోయినట్లు సమాచారం. కాగా, కొందరు కార్పొరేటర్లు అధికారులకు చెప్పినా సమస్య పరిష్కారం కావడం లేదంటూ సమావేశం మధ్యలోనే బయటకు వచ్చినట్లు తెలిసింది.

న్యాయసహాయం సమర్థవంతంగా అందించాలి


సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి జావీద్‌పాషా

ఖమ్మంలీగల్: జిల్లా న్యాయసేవాధికార సంస్థ ద్వారా అర్హులైన కక్షిదారులకు న్యాయసాయం అందిస్తున్న న్యాయవాదులు సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని సంస్థ జిల్లా కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అబ్దుల్ జావీద్‌పాషా సూచించారు. ఖమ్మంలో మంగళవారం ప్యానల్ న్యాయవాదులతో సమావేశమైన ఆయన లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం ఏర్పాటైన సందర్భంగా న్యాయసహాయ పనివిధానంలో వచ్చిన మార్పులను వివరించారు. ప్రస్తుతం అమల్లో ఉన్న ప్యానెల్ న్యాయవాదుల విధానం సివిల్ కేసుల్లో కొనసాగుతుందని, క్రిమినల్ కేసులను డిఫెన్స్ కౌన్సిల్‌కు ఇస్తామని తెలిపారు. ఇప్పటికే ప్యానల్ న్యాయవాదులకు ఇచ్చిన క్రిమినల్ కేసుల విచారణ ప్రారంభమై ఉంటే వారే కొనసాగుతారని చెప్పారు. కాగా, కామేపల్లి మండలం ముచ్చర్లలో రైతుల న్యాయసాయం కోసం ఏర్పాటైన అగ్రి లీగల్‌ఎయిడ్ క్లినిక్‌ను జావీద్ పాషా ఆకస్మికంగా సందర్శించారు. ఈ సమయాన వ్యవసాయ అధికారులు లేకపోవడంతో రైతులను, కూలీలను పిలిపించి మాట్లాడారు.

అన్ని దానాల్లోకెల్లా రక్తదానం మిన్న

ఆర్టీసీ ఆర్ఎం ప్రభులత


రక్తదాన శిబిరంలో పరిశీలిస్తున్న ఆర్ఎం ప్రభులత, అధికారులు

ఖమ్మం మామిళ్లగూడెం: సమాజం రక్తదానానికి మించినదేదీ లేదని ఆర్టీసీ ఆర్ఎం ఇ.ప్రభులత అన్నారు. ఖమ్మం రీజియన్‌లోని ఆరు డిపోల్లో మంగళవారం రక్తదాన శిబిరాలు ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా ఖమ్మం కొత్త బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన శిబిరాన్ని ప్రారంభించిన ఆమె మాట్లాడుతూ రక్తదానం చేయడం ద్వారా ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని ఆదుకున్నట్లవుతుందని తెలిపారు. రీజియన్‌లోని ఆరు డిపోల్లో ఉద్యోగులు సహా 219మంది రక్తదానం చేశారని చెప్పారు. డీఆర్ఎం బి.ప్రసాద్, ఖమ్మం డీఎం బి.శ్రీనివాస్, ఆర్టీసీ, ఇతర శాఖల ఉద్యోగులు రామిశెట్టి రామయ్య, డాక్టర్ గిరిసింహరావు, బాలు, ఎం.డీ.షఫీ, రఘుబాబు, శ్రీనివాసరావు, ఆకుతోట శ్రీనివాసరావు, అయోధ్య, మాధవరావు, పర్వీనా, రంజాన్, శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ కేంద్రప్రభుత్వ పథకాలు

ఖమ్మం మామిళ్లగూడెం/కల్లూరురూరల్: కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రధాని మోదీ నేతృత్వాన ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని మాజీ ఎమ్మెల్సీ, తమిళనాడు రాష్ట్ర సహ ఇన్‌చార్జి పొంగులేటి సుధాకర్‌రెడ్డి తెలిపారు. 'మేరా పోలింగ్ బూత్.. సబ్‌సే మజ్‌బూత్' కార్యక్రమంలో భాగంగా ప్రధాని మోదీ మధ్యప్రదేశ్‌లోని భూపాల్ నుండి చేసిన ప్రసంగాన్ని ఖమ్మంలోని బీజేపీ కార్యాలయంలో మంగళవారం నాయకులు వీక్షించారు. ఈ సందర్భంగా సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ కుటుంబ పాలన కావాలో, నీతి నిజాయితీ కలిగిన బీజేపీ పాలన కావాలో ప్రజలు నిర్ణయించుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, నాయకులు కడగంచి రమేష్, నంబూరి రామలింగేశ్వరావు, దొంగల సత్యనారాయణ, శ్యాంరాథోడ్, రుద్ర ప్రదీప్, న్నా రవికుమార్, మంద సరస్వతి, వీరభద్రం, రవీందర్, అల్లిక అంజయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే, కల్లూరు మండలం నారాయణపురంలో కూడా సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యాన ఇంటింటికీ వెళ్లి కేంద్రప్రభుత్వ పథకాలను వివరించారు. మండల అధ్యక్షుడు రామకృష్ణ, నాయకులు చిన్న కృష్ణ, వెంకట్, నర్సింహారావు, భీమరాజు పాల్గొన్నారు.

పూర్తి కాని దరఖాస్తుల పరిశీలన

- రూ.లక్ష సాయం కోసం 26,480 దరఖాస్తులు
- పరిశీలించాల్సినవి 5,300లకు పైగానే
- ఎంపీడీఓలు, కమిషనర్లకు అందని ఫార్వర్డ్ ఆప్షన్

ఖమ్మంమయూరిసెంటర్: బీసీల్లోని చేతి, కుల వృత్తిదారులకు ప్రభుత్వం రూ.లక్ష ఆర్థిక సాయం ప్రకటించగా.. ఈనెల 20 వరకు దరఖాస్తులు స్వీకరించారు. జిల్లాలో బీసీల్లోని 70 కులాలకు చెందిన 26,480 మంది దరఖాస్తు చేసుకోగా దరఖాస్తుల పరిశీలనలో ఆలస్యం జరుగుతోంది. ఈనెల 20వ తేదీ నుంచే పరిశీలన మొదలుపెట్టి 26వ తేదీ నాటికే పూర్తిచేయాల్సి ఉంది. కానీ పరిశీలన 22వ తేదీ నుండి ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు మధిర, సత్తుపల్లి, వైరా మున్సిపాలిటీల్లో కమిషనర్ల ఆధ్వర్యాన, మండలాల్లో ఎంపీడీఓల ఆధ్వర్యాన మొదలుపెట్టారు. సిబ్బంది కొరత, పరిశీలనకు తక్కువ సమయం ఉండడమే కాక దరఖాస్తుదారుడి ఇంటికి వెళ్లి ప్రత్యక్షంగా పరిశీలించాల్సి ఉండడంతో జిల్లాలో సుమారు 5,300 దరఖాస్తులు ఇంకా ఉన్నట్లు సమాచారం.

ఫార్వర్డ్ ఆప్షన్ ఏదీ?

దరఖాస్తులకు అవసరమైన కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు జారీ ఆలస్యం కావడంతో వేలాది మంది దరఖాస్తు చేసుకోలేదని చెబుతున్నారు. ఇక పరిశీలన కూడా ఆలస్యమవుతుండడంతో దరఖాస్తుదారులు ఆందోళన చెందుతున్నారు. పరిశీలన పూర్తయిన దరఖాస్తులను 27వ తేదీ వరకు డీబీసీడీడీ లాగిన్‌కు ఫార్వర్డ్ చేయాల్సి ఉంది. కానీ ఇప్పటివరకు ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లకు అవసరమైన ఆప్షన్‌ను బీసీ సంక్షేమశాఖ ఉన్నతాధికారులు ఇవ్వలేదు. కమిషనర్లు, ఎంపీడీఓలు దరఖాస్తులను డీబీసీడీడీకి ఫార్వర్ చేస్తే అక్కడ పరిశీలన అనంతరం జిల్లా కమిటీకి సిఫారసు చేయాల్సి ఉంటుంది. కానీ ఫార్వర్డ్ ఆప్షన్ ఇవ్వకపోవడంతో జాప్యం జరుగుతోంది.

సీఎం పర్యటనలో జిల్లా నేతలు

ఖమ్మంమయూరిసెంటర్: రెండు రోజుల పాటు మహారాష్ట్రలో పర్యటించిన సీఎం కేసీఆర్ వెంట జిల్లా ప్రజాప్రతినిధులు పలువురు పాల్గొన్నారు. బీఆర్ఎస్ లోక్‌సభా పక్షనేత, ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్రతో పాటు మాజీ ఎమ్మెల్యే బానోతు చంద్రావతి తదితరులు సీఎం వెంట పర్యటించారు.


కేసీఆర్‌తో కలిసి పూజలకు హాజరైన ఎంపీలు నామా నాగేశ్వరరావు, కవిత, మంత్రి సత్యవతి


సభలో పాల్గొన్న ఎంపీ రవిచంద్ర


సీఎంతో మాజీ ఎమ్మెల్యే చంద్రావతి

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ఖమ్మంరూరల్: మండలంలోని ఏదులాపురం శివారు సింహాద్రినగర్ వద్ద మంగళవారం రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శరత్ తాగునీరు తీసుకురావడానికి ద్విచక్రవాహనంపై వెళ్లి వచ్చే క్రమంలో రోడ్డు దాటుతుండగా ఎదురుగా మరో ద్విచక్రవాహనం బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన శరత్‌ను చికిత్స నిమిత్తం ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ వెంకటకృష్ణ తెలిపారు.

పోలీసుస్టేషన్ వద్ద ఇరువర్గాల దాడులు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం అర్బన్ పోలీసుస్టేషన్ గేటు ఎదురుగానే మంగళవారం ఇరువర్గాల వారు ఘర్షణకు దిగి దాడి చేసుకోవడంతో కాసేపు అక్కడ రణరంగంగా మారింది. నగరంలోని 15వ డివిజన్ అల్లీపురానికి చెందిన ఓ కుటుంబ సభ్యుల నడుమ ఘర్షణ జరిగింది. దీంతో ఇరువర్గాలు ఫిర్యాదు చేసేందుకు వచ్చారు. ఈక్రమంలో రెండు వైపులా బంధువులు పెద్ద సంఖ్యలో రావడంతో ఘర్షణ జరిగింది. దీంతో ఎస్ఐ బయటకు వచ్చి ఇరువర్గాలను చెదరగొట్టారు. ఈ ఘటనపై కేసు నమోదు కాలేదని పోలీసులు తెలిపారు.

రూ.3లక్షల విలువైన గంజాయి స్వాధీనం


గంజాయి, నిందితులతో ఎక్సైజ్ అధికారులు

వైరా: ఒడిశాకు తరలిస్తున్న నిషేధిత గంజా యిని వైరాలో ఎక్సైజ్ అధికారులు సోమవారం అర్ధరాత్రి స్వాధీనం చేసుకున్నారు. ఒడిశాలోని మల్కాన్‌గిరి జిల్లా అంబగూడ ప్రాంతానికి చెందిన సామేష్, తపన్మండల్, జూలీ సరకార ఆర్టీసీ బస్సులో గంజాయి ప్యాకెట్లు తరలిస్తున్నారనే సమాచారంతో ఎస్ఐ కిరీటి ఆధ్వర్యాన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా రూ.3లక్షల విలువైన 53.75 కిలోల ఎండు గంజాయి లభించింది. ఈ మేరకు గంజాయిని మంగళవారం ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జి.జనార్దన్‌రెడ్డి పరిశీలించి వివరాలు వెల్లడించారు. కాగా, నిందితులను రిమాండ్ నిమిత్తం మధిర కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ రమ్య, సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయం చేయాలంటూ వివాహిత నిరసన

కల్లూరు: ప్రేమ వివాహం చేసుకుని, ఇప్పుడు మరో పెళ్లికి సిద్ధపడిన వ్యక్తి ఇంటి ఎదుట వివాహిత నిరసనకు దిగింది. కల్లూరు అంబేద్కర్ నగర్‌కు చెందిన ఫార్మసిస్ట్ కోట విజయ, ఇదే కాలనీకి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఉబ్బన నాగేంద్ర మూడేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. ఇద్దరూ హైదరాబాద్‌లో కలిసే ఉంటుండగా, ఇటీవల నాగేంద్ర మరో పెళ్లికి సిద్ధమయ్యాడు. విషయం తెలిసిన విజయ ఆయన ఇంటికి వెళ్లి ఆరా తీయగా అత్త మాణిక్యం, భర్త నాగేంద్ర బెదిరించారని ఆరోపించింది. కాగా, తమకు అప్పటికే వివాహమైన విషయాన్ని చెప్పడంతో పెళ్లిచూపులు ఆగిపోయాయి. ఈమేరకు తనకు అన్యాయం చేయొద్దని కోరుతూ సోమవారం రాత్రి నుంచి విజయ నాగేంద్ర ఇంటి ముందు బైఠాయించి నిరసన తెలుపుతోంది.

ఎస్‌బీఐలో షార్ట్ సర్క్యూట్


బ్యాంకులో కాలిపోయిన సామగ్రి

కల్లూరు రూరల్: మండలంలోని చిన్న కోరుకొండి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖలో సోమవారం అర్ధరాత్రి విద్యుత్ సర్క్యూట్‌తో ప్రమాదం జరిగింది. షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించడంతో రూ.8లక్షల విలువైన సామగ్రి కాలిపోయింది. అయితే, సైరన్ మోగడంతో స్థానికులు గుర్తించి బ్యాంక్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఘటనపై ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చినట్లు మేనేజర్ రమేష్ తెలిపారు.

ఆటోడ్రైవర్‌పై పోక్సో కేసు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం గోపాలపురానికి చెందిన ఆటోడ్రైవర్ ఆర్.బాలుపై ఖమ్మం అర్బన్ పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. నగరంలోని వేణుగోపాలనగర్‌కు చెందిన బాలికపై లైంగిక దాడికి పాల్పడినట్లు అందిన ఫిర్యాదుతో బాలుపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

క్లుప్తంగా...

పోలీస్ శిక్షణకు ముమ్మర ఏర్పాట్లు

28 పోలీస్ శిక్షణ కేంద్రాలు సిద్ధం చేయాలని డీజీపీ ఆదేశం



సాక్షి, హైదరాబాద్: త్వరలో భర్తీ కానున్న నూతన కానిస్టేబుళ్ల శిక్షణపై పోలీస్ ఉన్నతాధికారులు దృష్టి సారించారు. ఇప్పటికే నియామక ప్రక్రియ తుది దశకు చేరుకుంది. దీంతో త్వరలో భర్తీ కానున్న 14,881 మంది పోలీస్ కానిస్టేబుళ్లకు శిక్షణనిచ్చేందుకు రాష్ట్రంలోని 28 పోలీస్ శిక్షణ కేంద్రాల్లో పూర్తిస్థాయి ఏర్పాట్లు చేయాలని డీజీపీ అంజనీ కుమార్ ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం ఆయన రాష్ట్రంలోని అన్ని పోలీస్ ట్రైనింగ్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో వీడియో సదస్సు నిర్వహించారు. శిక్షణ విభాగం ఐజీ తరుణ్ జోషితో కలిసి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా డీజీపీ అంజనీ కుమార్ మాట్లాడుతూ...రానున్న సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో శిక్షణ కార్యక్రమాలను ప్రారంభించనున్నామని వెల్లడించారు. శిక్షణ ప్రారంభానికి ముందుగానే అన్ని పోలీస్ ట్రైనింగ్ సెంటర్లలో (పీటీసీ) మౌలిక సదుపాయాల కల్పన, శిక్షణకు కావాల్సిన మెటీరియల్స్, వసతి తదితర సౌకర్యాలను సిద్ధం చేసుకోవాలని పీటీసీల అధికారులను ఆదేశించారు. భవనాలకు మరమ్మతులు, వైట్‌వాష్, టాయిలెట్ల సౌకర్యం, రీడింగ్ రూమ్ తదితర ఏర్పాట్లకు నిధులను అందచేస్తున్నామన్నారు. మహిళా ట్రైనీ పోలీస్ కానిస్టేబుల్ శిక్షణకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని తెలిపారు.

నేడు, రేపు తేలికపాటి వానలు

సాక్షి, హైదరాబాద్: ఒడిశా దాని పరిసరాల్లోని దక్షిణ జార్ఖండ్, ఉత్తర ఛత్తీస్‌గఢ్ వద్ద ఉన్న అల్పపీడనం మంగళవారం తెలంగాణ నుండి దూరంగా వెళ్లిపోయిందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. కాగా, రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు సాధారణ స్థితిలో ఉన్నాయి. దీంతో బుధ, గురువారాల్లో రాష్ట్రంలో అక్కడక్కడ తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొంది. గత 24 గంటల్లో ఆదిలాబాద్ సహా ఆ జిల్లాలోని థంసి, కొమురంభీం జిల్లా సిర్పూరుల్లో 5 సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది. కెరమెరి, తాల మడుగు, బెజ్జూరు, కాగజ్‌నగర్, వంకడి, ఆసిఫాబాద్, రంజాల్, జైనూర్, నవీపేట్‌లలో 3 సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది.

దేవరకొండ కాలేజీ ప్రాంగణంలో మార్కెట్టా?

నల్లగొండ కలెక్టర్ ఉత్తర్వులను నిలిపివేసిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: దాదాపు వేయి మంది విద్యార్థులు చదివే జూనియర్ కాలేజీ, ప్రాథమిక, ఉన్నత పాఠశాల ఉన్న స్థలంలో వెజ్, నాన్ వెజ్ మార్కెట్ ఎలా ఏర్పాటు చేస్తారని అధికారులను హైకోర్టు ప్రశ్నించింది. ఇది ఎంత మాత్రం సమర్థనీయం కాదంటూ గత సంవత్సరం డిసెంబర్ 9న నల్లగొండ కలెక్టర్ ఇచ్చిన ఉత్తర్వులను నిలిపివేసింది. తదుపరి వెల్లడించే వరకు ఈమధ్యంతర ఆదేశాలే అమలులో ఉంటాయని స్పష్టం చేసింది. విద్యాశాఖ కమిషనర్, నల్లగొండ కలెక్టర్, దేవరకొండ ఆర్డీవో, తహసీల్దార్‌సహా పలువురికి నోటీసులు జారీ చేస్తూ తదుపరి విచారణ నాటికి కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. నల్లగొండ జిల్లా దేవరకొండలో కళాశాలకు చెందిన 11 ఎకరాల భూమిలో 2 ఎకరాల్లో మార్కెట్ నిర్మాణం చేపట్టాలంటూ కలెక్టర్ ఇచ్చిన ఆదేశాలపై హైకోర్టులో దేవరకొండకు చెందిన టి.రవికుమార్ ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భుయాన్, జస్టిస్ తుకారాంజీ ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున న్యాయవాది తేరా రజినీకాంత్‌రెడ్డి వాదనలు వినిపించారు.

ఆగస్టు 30 వరకు ప్రత్యేక రైళ్ల పొడిగింపు

సాక్షి, హైదరాబాద్: దక్షిణమధ్య రైల్వేలోని వివిధ మార్గాల్లో అందుబాటులోకి తెచ్చిన 23 ప్రత్యేక రైళ్లను పొడిగించారు. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఆగస్టు 30 వరకు పొడిగించనున్నట్లు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్.రాకేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు సికింద్రాబాద్–సుబేదార్‌గంజ్, లింగంపల్లి, కాకినాడ, కాచిగూడ–మధురై, సికింద్రాబాద్–రామనాథపురం, సికింద్రాబాద్–పట్నా, సికింద్రాబాద్–దానాపూర్, కాచిగూడ–నాగర్‌సోల్, తదితర మార్గాల్లో నడిచే రైళ్లను ఆగస్టు చివరి వరకు నడపనున్నట్లు పేర్కొన్నారు.




పండరీపూర్, తుల్జాభవానీ ఆలయాలను సందర్శించుకున్న ముఖ్యమంత్రి కేసీఆర్




సర్కోలి సభకు హాజరైన ప్రజలు.. భగీరథ్ బాల్కేకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కేసీఆర్

మాది రైతుల టీం

▶ మొదటి పేజీ తరువాయి

మాదిరిగా దేశంలోని ఇతర ప్రాంతాల్లో ఎందుకు అభివృద్ధి సాధ్యం కాలేదని ప్రశ్నించారు. దేశంలో కోట్లాది ఎకరాల వ్యవసాయ భూమి, 75 వేల టీఎంసీల నీరు ఉందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సరైన విధానాలు అమలు చేస్తే ప్రతీ ఎకరాకు సాగునీరు అందించవచ్చన్నారు. నూతన జల విద్యుదుత్పత్తి విధానాలను బీఆర్‌ఎస్ లక్ష్యంగా పెట్టుకుందని చెప్పారు. దేశంలోని బొగ్గు నిల్వలు 150 సంవత్సరాలపాటు అవసరాలను తీరుస్తాయని, రైతులు ఏకమైతేనే సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. ఉచిత విద్యుత్, రైతుబంధు, రైతు బీమా వంటి తెలంగాణ పథకాలు మహారాష్ట్రలోనూ అమలు కావాలన్నారు. పనిచేయని ప్రభుత్వాన్ని తరిమికొట్టాలని, రైతుల కోసం పనిచేసే ప్రభుత్వాన్ని తెచ్చుకుందామని పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్‌లో చేరిన భగీరథ బాల్కేను ఎమ్మెల్యేగా గెలిపిస్తే మంత్రిని చేస్తానని కేసీఆర్ ప్రకటించారు.

రైతు బతికుంటేనే ప్లేటులోకి భోజనం

'రైతు బతికుంటే ఎవరు మరణిస్తారు, రైతు మరణిస్తే ఎవరు బతుకుతారని నేను నిత్యం చెబుతుంటాను. రైతు జీవించి ఉంటేనే భోజనం మన ప్లేటులోకి వస్తుంది. రైతు మరణిస్తే అందరి భోజన పాత్రలు ఎండిపోతాయి. రైతులు లేకుంటే ఇక ఎవరు బతకగలరు' అని కేసీఆర్ చెప్పారు. మహారాష్ట్రలో బీఆర్‌ఎస్ సర్కారు ఏర్పడితే రైతులందరికీ పెన్షన్ ఇవ్వడంతోపాటు సంక్షేమ కార్యక్రమాలన్నీ అమలు చేస్తామన్నారు. 'తుమ్మచెట్టును నాటితే మామిడి పండ్లు ఎలా కాస్తాయి. మామిడి పండ్లు తినాలనుకుంటే మామిడి చెట్టునే నాటాలి. పాలు కావాలంటే ఆవులకు గడ్డి వేయండి, గాడిదలకు గడ్డి వేసి, ఆవుల నుండి పాలు ఎలా పొందగలం' అంటూ ఓటు శక్తితో అసాధ్యాలను సుసాధ్యం చేయవచ్చని కేసీఆర్ అన్నారు.

ముగిసిన మహారాష్ట్ర పర్యటన

రెండురోజుల పర్యటనకు రోడ్డు మార్గంలో భారీ కాన్వాయ్‌తో వెళ్లిన కేసీఆర్ మంగళవారం రాత్రి హైదరాబాద్‌కు తిరిగి చేరుకున్నారు. సోమవారం రాత్రి షోలాపూర్ బాలాజీ సరోవర్ హోటల్‌లో బస చేసిన కేసీఆర్ మంగళవారం ఉదయం రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఇతర ముఖ్య నేతలతోపాటు పండరీపూర్‌కు చేరుకున్నారు. 10 గంటలకు పండరీపూర్‌లోని శ్రీ విఠల్ రుక్మిణిదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం సర్కోలిలోని భగీరథ బాల్కే నివాసానికి చేరుకుని ఆయన తండ్రి స్మారకానికి నివాళి అర్పించారు. అనంతరం జరిగిన సభలో కేసీఆర్ ప్రసంగించారు. తర్వాత పార్టీ నేతలతో కలిసి భాల్కే నివాసంలో భోజనం చేసి సాయంత్రం 4 గంటలకు సోలాపూర్‌కు చేరుకున్నారు. షోలాపూర్‌లోని స్థానిక కార్పొరేటర్ నగేశ్ వల్లియర్ నివాసానికి చేరుకుని పార్టీ నేతలతో కలిసి తేనీటి విందులో పాల్గొన్నారు. సాయంత్రం ఐదు గంటలకు తుల్జాపూర్ భవానీ ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం హైదరాబాద్‌కు తిరుగుపయనమయ్యారు.

విఠల్, రుక్మాయిలను దర్శించుకున్న కేసీఆర్

షోలాపూర్: పార్టీ విస్తరణలో భాగంగా షోలాపూర్ పర్యటనకు వచ్చిన బీఆర్‌ఎస్ చీఫ్, సీఎం కేసీఆర్ మంగళవారం ఉదయం పండరీపూర్‌లోని విఠల్, రుక్మాయిలను దర్శించుకున్నారు. ఉత్తరద్వారం నుంచి ఆలయంలోకి చేరుకున్న కేసీఆర్‌కు అర్చకులు, నిర్వాహకులు ఘనస్వాగతం పలికారు. విఠలేశ్వరుడి పాద ముద్రికలు, మూల విరాట్ విగ్ర హం దర్శనానంతరం కేసీఆర్ రుక్మిణీ అమ్మవారి పాదాలను పసుపు కుంకుమలతో అలంకరించి మొక్కుకున్నారు. అర్చకులు కేసీఆర్ మెడలో తులసిమాలను వేశారు. ప్రత్యేక పూజల్లో పాల్గొని, వేదపండితుల ఆశీర్వాదం తీసుకున్నారు. ఆషాఢ ఏకాదశి పర్వదినానికి రెండు రోజులే ఉండటంతో ఆలయంలో, బయట భక్తుల రద్దీ విపరీతంగా ఉంది. దీంతో కేసీఆర్, కొందరు ప్రజాప్రతినిధులు మినహా ఆయన వెంట వచ్చిన మిగతా వారికి వీఐపీ దర్శనం కల్పించలేదు. దీంతో వారు ఆలయ శిఖర దర్శనం చేసుకుని వెనుదిరిగారు. అదేవిధంగా ముందుగా ప్రకటించిన ప్రకారం వేయి కేజీల గులాబీ పూలను హెలికాప్టర్ ద్వారా కురిపించేందుకు పోలీసులు అనుమతివ్వలేదు. హైదరాబాద్ నుంచి కేసీఆర్ వెంట వచ్చిన 600 వాహనాలను భద్రతా కారణాలతో పోలీసులు పండరీపూర్‌లోకి అనుమతించలేదు. కేసీఆర్ షోలాపూర్ నుంచి పండరీపూర్ ఆలయానికి వస్తున్న క్రమంలో స్థానికులు ఆయనను చూసేందుకు పోటీపడ్డారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు కదిలారు.

ముగ్గురి ప్రాణం తీసిన ఆన్‌లైన్ జూదం

- ఆన్‌లైన్ పేకాటలో రూ.లక్షలు పోగొట్టుకున్న మహిళ
- అప్పులు ఇచ్చినవారి ఒత్తిడి పెరగడంతో మనస్తాపం
- ఇద్దరు చిన్నారులను చంపేసి, తానూ ఆత్మహత్య

చౌటుప్పల్: ఆన్‌లైన్ పేకాట ముగ్గురి ప్రాణాలు బలిగొంది. ఆటలో డబ్బులు పోవడం, అప్పుల వాళ్ల ఒత్తిడి పెరగడంతో.. తీవ్ర మనోవేదనకు గురైన మహిళ తన ఇద్దరు కుమారులను నీటి సంపులో తోసి హత్య చేసింది. ఆపై తానూ అందులోనే దూకి ప్రాణాలు తీసుకుంది. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో జరిగిన ఈ విషాదకర ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. వలిగొండ మండలం గొల్నేపల్లి గ్రామానికి చెందిన అవిశెట్టి నర్సింహ పెద్ద కుమారుడు మల్లేశ్‌కు భూదాన్ పోచంపల్లి మండలం దంతూరు గ్రామానికి చెందిన రాజేశ్వరి(28)తో పదేళ్ల కిందట పెళ్లైంది. వీరికి అనిరుధ్(5), హర్షవర్ధన్(3) కుమారులు. కొంతకాలం చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెంలో ఉండి.. ఏడేళ్ల క్రితం చౌటుప్పల్ పట్టణ కేంద్రానికి వచ్చారు. సాధారణ గృహిణి అయిన రాజేశ్వరి ఇంటర్మీడియట్ వరకు చదువుకుంది. తన వద్దనున్న స్మార్ట్‌ఫోన్‌లో ఆన్‌లైన్ (పేకాట)గేమ్‌కు ఆకర్షితురాలైంది. వేలల్లో పెట్టుబడి పెట్టి పేకాట ఆడి చాలా నగదు పోగొట్టుకుంది. ఇంట్లో తెలియకుండా పలువురి వద్ద అప్పు చేసింది. మొత్తంగా సుమారు రూ.8లక్షల వరకు పోగొట్టుకోవడంతో విషయం ఇంట్లో తెలిసింది. ఆమె భర్త మల్లేశ్ ఇటీవలే కొంత అప్పు తిరిగి చెల్లించాడు. ఇంకొంతమందికి ఇవ్వాల్సి ఉంది. అది తీర్చేందుకు నారాయణపురంలో ఉన్న ప్లాటును విక్రయించాలని ప్రయత్నాలు ప్రారంభించారు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం మల్లేశ్ ఇంటికి వచ్చిన అప్పు ఇచ్చిన వ్యక్తులు తమ డబ్బు చెల్లించాలని ఒత్తిడి చేశారు. వాళ్లు వెళ్లిపోయాక, మల్లేశ్ సమీపంలోనే ఉన్న బంధువు వద్దకు వెళ్లాడు. కాసేపటి తరువాత వచ్చిన అతనికి ఇంటి ఆవరణలోనే ఉన్న నీటి సంపులో ఇద్దరు కొడుకులు, భార్య విగతజీవులుగా కనిపించారు. ముగ్గురి మృతితో చౌటుప్పల్‌లో విషాదం అలుముకుంది.

బీఆర్‌ఎస్‌కు ఓటేస్తే.. బీజేపీకి వేసినట్లే!

- సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ధ్వజం
- బీజేపీకి బీఆర్‌ఎస్ మద్దతిస్తోంది
- మైనారిటీలను కేసీఆర్ మోసం చేశారు
- తెలంగాణలోనూ కర్ణాటక ఫలితమే వస్తుందని ధీమా



చివ్వెంల మండలం బి.చందుపట్ల గ్రామంలో డప్పు వాయిస్తున్న భట్టి విక్రమార్క

చివ్వెంల (సూర్యాపేట): కర్ణాటక ఎన్నికల్లో వచ్చిన ఫలితమే తెలంగాణలోనూ వస్తుందని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క అన్నారు. బీఆర్‌ఎస్‌కు వేసే ప్రతి ఓటు బీజేపీ వేసినట్లేనని దుయ్యబట్టారు. లౌకిక పార్టీ కాంగ్రెస్‌కు ఓటు వేస్తేనే బీజేపీకి వ్యతిరేకంగా వేసినట్లు అవుతుందని చెప్పారు. భట్టి మంగళవారం సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం తిమ్మాపురం, బి.చందుపట్ల గ్రామాల్లో ప్రాదయాత్ర చేశారు. చందుపట్లలో జరిగిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ.. మైనారిటీలకు 12 శాతం రిజర్వేషన్ ఇస్తామని మోసం చేసిన కేసీఆర్‌కు వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. మంత్రి కేటీఆర్ ఢిల్లీకి వెళ్లి కేంద్ర మంత్రులను కలవడంతోనే బీజేపీ, బీఆర్‌ఎస్ వేర్వేరు కాదని మరోసారి స్పష్టమైందన్నారు. చట్టసభల్లో బీజేపీ తెచ్చిన అనేక బిల్లులకు బీఆర్‌ఎస్ ఎంపీలు మద్దతు తెలిపారన్నారు. భారత్ జోడో యాత్రకు భయపడి రాహుల్ గాంధీ అభ్యర్థిత్వాన్ని ప్రధాని మోదీ రద్దు చేయించారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చట్టాలు తెచ్చినా బీఆర్‌ఎస్ మద్దతు ఇస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ అవినీతిపై మాట్లాడుతున్న కేంద్ర ప్రభుత్వ పెద్దలు.. సీఎం కేసీఆర్‌పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే జనాభా దామాషా ప్రకారం నిధులు కేటాయించి, బీసీ సబ్‌ప్లాన్ తెస్తామన్నారు. తెలంగాణలో ప్రజల ఆకాంక్ష నెరవేరలేదని, నియామకాలు లేకపోవడంతోనే యూనివర్సిటీలు నిరుద్యోగులకు కేంద్రాలుగా మారాయని ఎద్దేవా చేశారు. రైతుబంధు మాత్రమే ఇచ్చి రైతులకు అన్ని రకాల సబ్సిడీలు రాష్ట్ర ప్రభుత్వం తొలగించిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షలు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చారు. ఇళ్లులేని వారికి డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేస్తామన్నారు. కాగా, బి.చందుపట్ల గ్రామంలో భట్టి పత్తిచేను దున్నుతున్న రైతు వద్దకు వెళ్లి అరక పట్టి కొద్దిసేపు దుక్కిదున్నారు. గీత కార్మికులతో మాట్లాడి, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి పటేల్ రమేష్ రెడ్డి, టీపీసీసీ మహిళా కాంగ్రెస్ చైర్మన్ సునీతారావు పాల్గొన్నారు.

పాపం పండే రోజు దగ్గరలో ఉంది: గద్దర్

చివ్వెంల(సూర్యాపేట): పదేళ్ల పాలనలో పాపం నిండిపోయింది.. ఆ పాపం పండే రోజు దగ్గరకు వచ్చింది.. అని ప్రజాపార్టీ వ్యవస్థాపకుడు గద్దర్ అన్నారు. ఆయన మంగళవారం సూర్యాపేట జిల్లా చివ్వెంల మండల పరిధిలోని బి.చందుపట్ల గ్రామంలో సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పాదయాత్రకు మద్దతు తెలిపి మాట్లాడారు. ధరణి పేరుమీద రైతులను, ప్రశ్నపత్రాలను లీక్ చేసి విద్యార్థులను ప్రభుత్వం మింగేసిందని విమర్శించారు. భట్టి విక్రమార్క పాదయాత్ర చారిత్రకమైందన్నారు. ఈ సందర్భంగా ఆయన పలు గీతాలు ఆలపించి.. మహిళలతో కోలాటం ఆడారు.

పార్టీ ఆదేశిస్తే ఖమ్మంలో పోటీ

మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి



మాట్లాడుతున్న సుధాకర్‌రెడ్డి, పక్కన నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: పార్టీ అధిష్ఠానం ఆదేశిస్తే ఖమ్మంలో పోటీ చేసేందుకు సిద్ధమేనని మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ తమిళనాడు సహ ఇంచార్జి పొంగులేటి సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఖమ్మంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణతో కలిసి మాట్లాడుతూ బీఆర్‌ఎస్, కాంగ్రెస్ కుమ్మక్కై ప్రజలను మోసం చేస్తున్నాయని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేస్తే బీఆర్‌ఎస్‌కు ఓటు వేసినట్లేనని తెలిపారు. ఏనాడు ఉద్యమంలో పాల్గొనని, లాఠీదెబ్బలు తినని వాళ్లు ఈరోజు తెలంగాణపై మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, నాయకులు గెంటెల విద్యాసాగర్, దొంగల సత్యనారాయణ, నంబూరి రామలింగేశ్వరావు, శ్యాంరాథోడ్, రుద్ర ప్రదీప్, నున్నా రవికుమార్, మందా సరస్వతి, నకిరికంటి వీరభద్రం, దోకుపర్తి రవీందర్, అల్లిక అంజయ్య, వెంకట్, భద్రం, సుదర్శన్, రవిరాథోడ్, శంకర్‌గౌడ్, అంకతి పాపారావు, దీకొండ శ్యాం, ఫణికుమారి, సుగుణ పాల్గొన్నారు.

ముగిసిన ఎన్‌సీసీ శిక్షణ



ప్రశంసా పత్రాలు అందుకున్న కేడెట్లతో ఎన్‌సీసీ అధికారులు, నవోదయ ప్రిన్సిపాల్

కూసుమంచి: కూసుమంచి మండలం పాలేరులోని జవహర్ నవోదయ విద్యాలయలో ఈనెల 18 నుండి నిర్వహిస్తున్న ఎన్‌సీసీ శిక్షణ శిబిరం మంగళవారం ముగిసింది. ఖమ్మం 11వ బెటాలియన్ ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన ఈ శిబిరంలో 350మంది కేడెట్లకు ఫైరింగ్, డ్రిల్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, ఫైర్ సేఫ్టీ తదితర అంశాల్లో శిక్షణ ఇచ్చారు. ప్రతిభ చూపిన కేడెట్లకు లెఫ్టినెంట్ కమాండెంట్ కల్నల్ సునీల్ యాదవ్, ప్రిన్సిపాల్ చంద్రబాబు పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. నవోదయ ఎన్‌సీసీ ఇన్‌చార్జి లక్ష్మీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాక్సినేషన్ పూర్తిచేయాలి

కల్లూరు: గర్భిణులు, చిన్నారులకు 100 శాతం వ్యాధి నిరోధక టీకాలు వేసి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఖమ్మం జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ప్రమీల సూచించారు. కల్లూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని పీహెచ్‌సీల వైద్యాధికారులు, సిబ్బందితో మంగళవారం ఆమె కల్లూరు పీహెచ్‌సీలో సమావేశమై సూచనలు చేశారు. జిల్లా వ్యాక్సిన్ మేనేజర్ సీహెచ్.రమణ, డిస్ట్రిక్ డేటా మేనేజర్ నాగరాజు పాల్గొన్నారు.



సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న తులసిచందు. చిత్రంలో వివిధ సంఘాల నేతలు

ప్రశ్నించే గొంతుకలను అణగదొక్కుతున్నారు

- స్వతంత్ర జర్నలిస్ట్ తులసిచందు ఆవేదన
- 'జర్నలిజం–ట్రోల్ ముఠాలు' అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం
- ట్రోలింగ్ ముఠాలకు తగిన గుణపాఠం చెప్పాలన్న వక్తలు
- తులసీచందుకు జర్నలిస్టులు, ప్రజా సంఘాల మద్దతు

పంజగుట్ట (హైదరాబాద్): ప్రశ్నించే జర్నలిస్టుల గొంతులను కొందరు మతవాదంతో అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నారని స్వతంత్ర జర్నలిస్టు తులసిచందు అన్నారు. జీహెచ్‌ఎంసీ ఎన్నికల సమయంలో 'మతం వస్తుంది మేలుకో' అని వీడియో చేసినందుకు తనపై యాంటీ హిందూ ముద్ర వేశారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల తాను పెట్టిన కంటెంట్ మీద ఫేస్‌బుక్‌లో ఎటాక్ జరిగిందన్నారు. మంగళవారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్, హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్, హైదరాబాద్ ప్రెస్‌క్లబ్, నెట్‌వర్క్ ఆఫ్ ఉమెన్ ఇన్ మీడియా, తెలంగాణ స్టేట్ స్మాల్ అండ్ మీడియం పేపర్స్, మేగజైన్స్ అసోసియేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో 'జర్నలిజం– ట్రోల్ ముఠాలు' అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విరాహత్ అలీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏపీ ప్రభుత్వ జాతీయ మీడియా సలహాదారు దేవులపల్లి అమర్, ప్రొఫెసర్ హరగోపాల్, సీనియర్ పాత్రికేయులు కె.రామచంద్రమూర్తి, పాశం యాదగిరి, కె.శ్రీనివాస్, వేణుగోపాల్, ప్రొఫెసర్ పద్మజాషా, సామాజిక కార్యకర్తలు సజయ, పీవోడబ్ల్యూ సంధ్య, రాజకీయ విశ్లేషకులు డాక్టర్ మిత్రలతో పాటు 39 పౌరసంఘాలు పాల్గొని తులసిచందుకు సంఘీభావం తెలిపాయి. తులసిచందు మాట్లాడుతూ, తాను ఏ వార్తను సృష్టించ లేదని, అయినా తనను శత్రువుగా, అర్బన్ నక్సలైట్‌గా చిత్రీకరిస్తున్నారని ఆమె పేర్కొన్నారు. ప్రశ్నించే గొంతుకలపై దాడులు చేస్తున్నవారి వెనక ఎవరు ఉన్నారో ఆరాతీయాల్సిన అవసరం ఉందన్నారు. బీజేపీ నేతలను, ప్రధానిని ప్రశ్నించే వారిపై నేరుగా దాడులు చేసేందుకు ఓ వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నారని ఆమె ఆరోపించారు. తనపై దాడి చేస్తున్న మూడు యూట్యూబ్ చానల్స్, ఒక ఫేస్‌బుక్ ఖాతాపై కేసు పెట్టానని వెల్లడించారు. ప్రశ్నించే జర్నలిస్టులపై దాడులు చేస్తే అంతా ఐక్యం కావాల్సిన అవసరం ఉందన్నారు.

దేవులపల్లి అమర్ మాట్లాడుతూ, సోషల్ మీడియా వెలుగులోకి వచ్చాక ఇండిపెండెంట్ జర్నలిజం విస్తృతంగా ప్రాచుర్యం పొందిందని తెలిపారు. గతంలో వార్తాపత్రికలే ఉన్నప్పుడు ఒక సంస్థపైగానీ, వ్యక్తిపైగానీ వ్యతిరేక వార్తలు రాస్తే యాజమాన్యానికి, సంపాదకులకు ఫిర్యాదు చేసేవారని, సోషల్ మీడియా పెరుగుతున్న క్రమంలో ఇండిపెండెంట్ జర్నలిజంలో ఏ సంపాదకుని కట్టడి లేకుండా పోయిందన్నారు. ఇండిపెండెంట్ జర్నలిజం రావడం చాలామందికి ఇష్టం ఉండదని, అదే తులసిపై దాడికి దారితీసిందని అన్నారు. తులసికి తానుపూర్తి సంఘీభావం తెలుపుతున్నట్లు ప్రకటించారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ, సమాజంలో దళిత, మైనార్టీ మహిళలపై దాడులు జరుగుతూనే ఉన్నాయని, ఈ దాడి తులసి మీద కాకుండా యావత్ మహిళలపై దాడిగా భావించాలన్నారు. తులసికి పౌరహక్కుల సంఘాలు, ప్రజా సంఘాలు పూర్తి మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటించారు.

జూలై 8న హైదరాబాద్‌లో బీజేపీ సమావేశం

హాజరుకానున్న 11 రాష్ట్రాల అధ్యక్షులు, సంస్థాగత జీఎస్‌లు

సాక్షి, హైదరాబాద్: దక్షిణాది రాష్ట్రాలతోపాటు వాటికి ఆనుకుని ఉన్న 11 రాష్ట్రాల బీజేపీ అధ్యక్షులు, సంస్థాగత ప్రధానకార్యదర్శుల సమావేశం వచ్చేనెల 8న హైదరాబాద్‌లో జరగనుంది. పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, సంస్థాగత ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్ హాజరుకానున్న ఈ భేటీలో వచ్చే ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించనున్నారు. ఈ ఏడాది చివర్లోగా ఐదు రాష్ట్రాల ఎన్నికలతో సహా 2024 ఏప్రిల్‌లో జరగనున్న లోక్‌సభకు సన్నద్ధమయ్యే విషయంపైనా చర్చ జరగనుంది. తెలంగాణతో సహా ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి, గోవా, లక్షద్వీప్, అండమాన్–నికోబార్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌ల నుంచి నేతలు పాల్గొననున్నారు. కొన్ని నెలల క్రితం హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో ప్రాథమికంగా చర్చలు జరపగా, అందులో చర్చించిన అంశాలు, సాధించిన లక్ష్యాలను ఈ సమావేశంలో సమీక్షించనున్నారు. ఈ సమావేశం ముగిశాక సాయంత్రం.. ప్రధాని మోదీ లేదా కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పాల్గొనేలా బహిరంగసభ నిర్వహించాలనే ఆలోచనలో రాష్ట్ర పార్టీ ఉంది.

ఎస్సీ వర్గీకరణ సాధించే వరకు పోరాటం

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ



మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ

పాల్వంచ: ఎస్సీ వర్గీకరణ చేయకపోవడంతో మాదిగలు నష్టపోతున్నందున లక్ష్యాన్ని సాధించే వరకు పోరాటం ఆపేది లేదని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ స్పష్టం చేశారు. పాల్వంచలో మంగళవారం నిర్వహించిన జిల్లా సదస్సులో ఆయన మాట్లాడారు. గతంలో ఐదేళ్ల వర్గీకరణ అమల్లో ఉండగా, 27 వేల మందికి ఉద్యోగాలు దక్కాయని.. 2004లో వర్గీకరణ రద్దు చేయగా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. ఫలితంగా ఇంజనీరింగ్, మెడికల్ సీట్లు, ఉద్యోగ అవకాశాల్లో తీరని అన్యాయం జరుగుతోందని పేర్కొన్నారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ ఇతర పార్టీలతో తిరిగితే ప్రయోజనం లేనందున జాతి కోసం, వెనుకబడుతున్న బతుకుల కోసం పోరాడాలని సూచించారు. ప్రధాని మోదీ, అమిత్ షా వర్గీకరణకు అనుకూలమని చెబుతున్నారు తప్ప తొమ్మిదేళ్లుగా ఎందుకు వర్గీకరణ చేయడం లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో నాలుగు శాతం జనాభా ఉన్న మాలలకు మంత్రి పదవి ఇవ్వగా.. మాదిగల నుంచి పదవి లేకపోవడంతో తమ సమస్యలు ప్రభుత్వం దృష్టికి వెళ్లడం లేదని మంద కృష్ణ తెలిపారు. కాగా, ఎస్సీ వర్గీకరణ డిమాండ్‌తో వచ్చే నెల మూడో వారంలో చలో హైదరాబాద్ చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. సదస్సులో నాయకులు కొత్తపల్లి సోమయ్య, ఏపూరి నాగేశ్వరరావు, బచ్చలకూర వెంకటేశ్వర్లు, వంగూరి ఆనంద్ రావు, మిరియాల వెంకటేశ్వర్లు, చర్ల వెంకప్పటయ్య, కటుకూరి వెంకటేశ్వర్లు, కత్తి శ్రీను, గుర్రం నాగమణి, బోగిని సందీప్, జి.శ్రీను పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారం సరుకులు సరఫరా చేయాలి

ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్



తరగతి గదిలో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న డేవిడ్‌రాజ్

భద్రాచలం: కాంట్రాక్టర్లు ప్రభుత్వ నిబంధనల ప్రకారం సరుకులు సరఫరా చేయాలని, ఎక్కడి నుంచైనా ఫిర్యాదు అందితే టెండర్లు రద్దు చేసి వారిని బ్లాక్ లిస్ట్‌లో పెడతామని ఐటీడీఏ ఏపీఓ జనరల్, గురుకులాల ఇన్‌చార్జ్ ఆర్‌సీఓ, ఇన్‌చార్జ్ డీడీ డేవిడ్‌రాజ్ స్పష్టం చేశారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల్లోని గిరిజన సంక్షేమ శాఖ గురుకులాలు, పాఠశాలలకు సరుకులు, ఆహార పదార్థాల సరఫరా కాంట్రాక్టర్లను మంగళవారం ఖరారు చేశారు. ఈ సందర్భంగా ఏపీఓ మాట్లాడుతూ.. గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికరమైన ఆహారం మెనూ ప్రకారం అందించాలని సూచించారు. ఈ విషయంలో కాంట్రాక్టర్లు నాణ్యమైన పదార్థాలు సరఫరా చేసేలా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. జీసీసీ డీఎం విజయ్‌కుమార్, ఏటీడీఓలు నర్సింహారావు, చంద్రమోహన్, గురుకుల ప్రిన్సిపాల్ గామయ్య, జీసీసీ మేనేజర్లు విజయ్‌కుమార్, నర్సింహారావు, లక్ష్మి జి.దావీద్‌తో పాటు ఉద్యోగులు సుగుణ, వీరభద్రస్వామి పాల్గొన్నారు.

వంద శాతం హాజరు నమోదు

గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల్లో గిరిజన విద్యార్థులు వంద శాతం హాజరయ్యేలా చూడాలని, లేనిపక్షంలో హెచ్‌ఎంలపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని డేవిడ్‌రాజ్ హెచ్చరించారు. భద్రాచలంలోని గిరిజన సంక్షేమ శాఖ బాలుర ఆశ్రమ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాజరు తక్కువగా ఉండటంతో హెచ్‌ఎంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం రికార్డులు, విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. భద్రాచలం ఏటీడీఓ నర్సింహారావు, హెచ్‌ఎం నరేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో గంజాయిపై ఉక్కుపాదం

ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి



మాట్లాడుతున్న డీసీ జనార్దన్‌రెడ్డి

నేలకొండపల్లి: ఖమ్మం ఉమ్మడి జిల్లాలో గంజాయి రవాణాను అడ్డుకునేందుకు అన్ని చర్యలు చేపడుతున్నామని ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ జి.జనార్దన్‌రెడ్డి వెల్లడించారు. నేలకొండపల్లి ఎక్సైజ్ సర్కిల్ స్టేషన్‌ను మంగళవారం తనిఖీ చేసిన ఆయన అధికారులతో సమావేశమయ్యారు. అనంతరం డీసీ మాట్లాడుతూ గంజాయి రవాణాను అరికట్టేందుకు భద్రాచలం, అశ్వారావుపేట, ముత్తగూడెం, బోనకల్ ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు. అలాగే, ఎమ్మార్పీకి మించి మద్యం విక్రయిస్తున్నట్లు తేలడంతో మధిర, ఖమ్మం, ఇల్లెందు, కొత్తగూడెం, పాల్వంచ, భద్రాచలం, సత్తుపల్లిల్లో వైన్స్ నిర్వాహకులపై కేసులు నమోదు చేశామని చెప్పారు. సమావేశంలో ఖమ్మం ఎక్సైజ్ సూపరింటెండెంట్ జి.నాగేందర్‌రెడ్డి, నేలకొండపల్లి సీఐ విజేందర్, ఎస్సైలు శంకర్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీ సోలిపేట రాంచంద్రారెడ్డి కన్నుమూత



బంజారాహిల్స్/దుబ్బాక టౌన్: రాజ్యసభ మాజీ సభ్యుడు సోలిపేట రాంచంద్రారెడ్డి (88) మంగళవారం ఉదయం బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీలోని తన నివాసంలో కన్నుమూశారు. గత కొంత కాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నా రు. మంగళవారం సాయంత్రం ఫిలింనగర్ మహాప్రస్థానంలో ఆయన అంత్యక్రియలు జరిగాయి.

మచ్చలేని వ్యక్తిగా పేరు: సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం చిట్టాపూర్‌కు చెందిన సోలిపేట రాంచంద్రారెడ్డి 1935 మే 17న మాలిపటేల్ గాలిరెడ్డి–సుందరమ్మ దంపతులకు జన్మించారు. స్వగ్రామం చిట్టాపూర్‌లో ప్రాథమిక, సిద్దిపేటలో హైస్కూల్ విద్యాభ్యాసం కొనసాగింది. రాంచంద్రా రెడ్డి తొలి తరం కమ్యూనిస్టు నాయకుల స్ఫూర్తితో తెలంగాణ రైతాంగ పోరాటంలో పాల్గొన్నారు. సిటీ కాలేజీలో పట్టభద్రులైన రాంచంద్రారెడ్డి రాజకీయాల్లో పూర్తి కాలం పనిచేశారు. 70 ఏళ్లపాటు రాజకీయాల్లో క్రియాశీలకంగా పనిచేసి మచ్చలేని వ్యక్తిగా పేరొందారు.

సర్పంచ్ నుంచి ఎంపీ వరకు.. చిట్టాపూర్ తొలి సర్పంచ్‌గా రాజకీయ ప్రస్థానం (1955 నుంచి 1964 వరకు) చేపట్టిన రాంచంద్రారెడ్డి 1972 నుంచి 1978 వరకు దొమ్మాట నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా పనిచేశారు. 1996 నుంచి 2002 వరకు టీడీపీ నుంచి రాజ్యసభ సభ్యుడిగా ఎంపికై రాజ్యసభలో టీడీపీ ఫ్లోర్ లీడర్‌గా, రాజ్యసభ అష్యూరెన్స్ కమిటీ చైర్మన్‌గా పనిచేశారు. కమ్యూనిస్టుగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించి కాంగ్రెస్, టీడీపీలో కీలక పదవుల్లో పనిచేశారు. అలాగే దుబ్బాక సమితి అధ్యక్షుడిగా, సిద్దిపేట మార్కెట్ కమిటీ చైర్మన్‌గా, మెదక్ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు అధ్యక్షుడిగా, భారత్–చైనా మిత్ర మండలికి అధ్యక్షుడిగా, సీఆర్ ఫౌండేషన్, తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్ట్‌లకు ఆయన సేవలు అందించారు. కొంతకాలం లోక్‌సత్తాలోనూ పనిచేశారు. దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ, సీఎంలు చెన్నారెడ్డి, ఎన్టీఆర్, చంద్రబాబు, సీఎం కేసీఆర్‌లతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. ప్రముఖ కవి సినారెకు రామచంద్రారెడ్డి వియ్యంకుడు. డాక్టర్ సి.నారాయణరెడ్డి చిన్న కుమార్తెను తన పెద్ద కుమారుడు వెంకటేశ్వరరెడ్డికి చేసుకున్నారు.

సీఎం సంతాపం: సోలిపేట రామచంద్రారెడ్డి మృతిపట్ల ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు సంతాపాన్ని ప్రకటించారు. నాటి తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో పాల్గొన్న సోలిపేట జీవితం ఆదర్శవంతమైనదని గుర్తుచేశారు.